

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 264 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం, 24, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# దేశంపై నమ్మక ద్రోహుల దాడి !

దేశంలో పెరిగిపోతున్న ద్రోహం

విద్యార్థులు రోడ్లెక్కే ప్రక్రియ నిరంతరంగా సాగుతుంది

దేశంలో వేగంగా మారిపోతున్న రాజకీయ పరిణామాలు

దేశంలోని అన్ని వర్గాలను సునాయాసంగా మోసగిస్తున్న కేంద్రం

దేశ సంస్కృతిని దరిద్రంగా తయారు చేస్తున్నారు

లక్ష పాఠశాలలను మూసివేసిన ఏకైక ప్రభుత్వం బిజెపి

లక్షల కోట్ల రూపాయలను వ్యాపారస్తులకు కట్టబెడుతున్న వైనం

ప్రభుత్వాల ఆదినంలోని లొంగుబాటుకే ఎక్కువ ప్రాధాన్యతను కనపరుస్తున్నారు

కేంద్రం మాట వినకపోతే పుట్టగతులు లేకుండా చేస్తున్నారు

దుబారా పాలనలో దేశముదురులుగా ఎదుగుతున్నారు

రాజకీయం వ్యాపారమైపోతుంది

దగా పడ్డ దేశం" దరిద్రంగా మారిపోతుంది




డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

దేశంలో ప్రజా విశ్వాసం క్రమంగా సన్నగిల్లుతోందని డాక్టర్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పదవుల్లో ఉన్నవారు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి దేశ ప్రయోజనాల కంటే అధికార పరిరక్షణకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రజాప్రతినిధులపై పెండింగ్‌లో ఉన్న కేసులు రాజకీయ వ్యవస్థలో జవాబుదారీతనం లోపించిందనే విషయాన్ని వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. ఉగ్రదాడులు, ప్రజా ఉద్యమాలు, నిరుద్యోగ సమస్యలు వంటి కీలక అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలు జరుగుతున్నాయని విమర్శించారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులు తమ హక్కుల కోసం రోడ్లపైకి వస్తున్నా వారి సమస్యలకు సరైన పరిష్కారం చూపడం లేదన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగాలు, ధరల పెరుగుదల వంటి మౌలిక సమస్యలపై ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వందేమాతరం అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా ప్రజాస్వామ్య విలువలు, వ్యక్తిగత స్వేచ్ఛలను గౌరవించాలని సూచించారు. దేశభక్తి అనేది చట్టపరమైన బలవంతం ద్వారా కాకుండా ప్రతి పౌరుడి మనస్సులో నుంచి రావాలని స్పష్టం చేశారు. ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే రాజకీయాలకు స్వస్తి పలికి దేశ సమగ్రత, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు, మేధావులు, జర్నలిస్టులు, కవులు, కళాకారులు, ప్రజలు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కలసి నిలవాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు.
- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## సింగరేణి అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు

కొత్త బొగ్గు గనులు ప్రారంభించాలి

సంస్థకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి

సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించాలి

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

లాభాల వాటా ప్రకటించాలని డిమాండ్

6



## కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం

సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్

మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్



6

## క్రమశిక్షణ కమిటీకి కొండాసురేఖ వ్యవహారం

ఇందులో ఎవ్వరు కూడా ఇక మాట్లాడొద్దు

సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

రాజకీయ వ్యవహారాలపై ప్రజాపతినిధులతో రేవంత్ చర్చ

7



## తెలంగాణ పెట్టుబడులను అడ్డుకునే కుట్ర

గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోడీ

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం

అమెరికా టూర్ రద్దును ఊరికే వదలబోం

పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది

నన్ను అడ్డుకున్నా..నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు

మీడియా సమావేశంలో సిఎం రేవంత్ మండిపాటు

6



# కోర్టు ఆదేశాలు బేఖాతర్!

**డీఈవో ఉత్తర్వులు.. అమలు ఏది?**
**ష్యూరిటీ ఇచ్చిన టీచర్ జీతానికే కోత**
**అసలు రుణగ్రహీతకు ఫుల్ జీతం?**
**కోర్టు ఆదేశాల అమలుపై ప్రశ్నలు**



**భూపాలపల్లి, ఆగస్టు 24 (జై భీమ్ న్యూస్):**

కోర్టు ఆదేశాల అమలులో భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ ఉపాధ్యాయుడు తీసుకున్న రుణానికి ష్యూరిటీగా నిలిచిన మరో ఉపాధ్యాయుడి జీతం నుంచి బకాయిలు మినహాయించాలని కోర్టు ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాల అమలు తీరుపై స్పష్టత లేకపోవడం వివాదాస్పదంగా మారింది. కోర్టు ఆదేశాలను అమలు చేయాలని డీఈవో స్వయంగా ఉత్తర్వులు జారీ చేసినా, తదుపరి చర్యలను పర్యవేక్షించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం జెడ్పీఎస్ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అడెపు వెంకటేశ్వర్లు ఓ రుణ వ్యవహారంలో ష్యూరిటీగా ఉన్నట్లు కోర్టు పరిధిలోని కేసు ద్వారా తెలుస్తోంది. రుణ బకాయిలకు సంబంధించి శ్రీరామం చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హనుమకొండ నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించింది. మొత్తం రూ.11,20,821 బకాయి ఉన్నట్లు పేర్కొంది. కోర్టు ఆదేశాల మేరకు వెంకటేశ్వర్లు జీతం నుంచి రూ.3,73,607 మినహాయించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**డీఈవో ఉత్తర్వులు.. అమలు ఏది?**

కోర్టు ఆదేశాలను ఉటంకిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. రాజేందర్ గత జూలై 22న రంగాపురం జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయుడికి ఉత్తర్వులు జారీ చేశారు. నిర్దేశిత మొత్తాన్ని జీతం నుంచి మినహాయించి, హనుమకొండ నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పేరిట డీడీ రూపంలో చెల్లించాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలపై తమ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని కూడా స్పష్టం చేశారు. అయితే ఉత్తర్వులు జారీ చేసి నెల రోజులు దాటుతున్నా.. జీతం నుంచి మొత్తాన్ని మినహాయించారా? మినహాయించిన మొత్తం కోర్టుకు చెల్లించారా? అనే అంశాలపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**అసలు రుణగ్రహీతకు పూర్తి జీతమా?**

రుణం తీసుకున్న వ్యక్తి జీతం నుంచి కాకుండా ష్యూరిటీ ఇచ్చిన ఉపాధ్యాయుడి జీతం నుంచే కోతలు ఎందుకు విధిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు రుణగ్రహీతకు పూర్తి జీతం అందుతున్నట్లయితే దానికి కారణాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉందని బాధిత వర్గాలు అంటున్నాయి. కోర్టు ఆదేశాలను అమలు చేయాలని డీఈవో ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో.. ఇప్పటివరకు ఎంత మొత్తాన్ని మినహాయించారు? కోర్టుకు ఎప్పుడు చెల్లించారు? అసలు రుణగ్రహీత జీతం నుంచి ఎందుకు కోత విధించలేదు? అనే ప్రశ్నలకు విద్యాశాఖ సమాధానం చెప్పాలని పలువురు కోరుతున్నారు. కోర్టు ఆదేశాలు కాగితాలకే పరిమితం కాకుండా పూర్తిస్థాయిలో అమలయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతతో పరిష్కారం

**సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**





ప్రజల నుంచి ప్రజావాణి ద్వారా అందే దరఖాస్తులను సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 145 దరఖాస్తులు అందగా, రెవెన్యూ శాఖకు 42, జీడబ్ల్యూఎంసీకి 26, హౌసింగ్ శాఖకు 14, డీఆర్డీవోకు 14, ఇతర శాఖలకు సంబంధించి 49 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసిన కలెక్టర్, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ, డీఆర్డీవో శాఖలకు సంబంధించిన సమస్యలపై అధిక సంఖ్యలో వినతులు వచ్చినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యపై వచ్చిన వినతులను పరిశీలించిన ఆమె, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో టైలరింగ్‌లో నైపుణ్యం ఉన్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలాల పరిధిలోనూ ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పెన్షన్ తదితర సమస్యలను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డా. రాజారెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

# దేశంపై నమ్మకద్రోహుల దాడి

**దేశంలో పెరిగిపోతున్న ద్రోహం**
**దగా పడ్డ దేశం" దరిద్రంగా మారిపోతుంది**
**విద్యార్థులు రోడ్లెక్కే ప్రక్రియ నిరంతరంగా సాగుతుంది**
**దేశంలో వేగంగా మారిపోతున్న రాజకీయ పరిణామాలు**
**దేశంలోని అన్ని వర్గాలను సునాయాసంగా మోసగిస్తున్న కేంద్రం**
**దేశ సంస్కృతిని దరిద్రంగా తయారు చేస్తున్నారు**
**లక్ష పాఠశాలలను మూసివేసిన ఏకైక ప్రభుత్వం బిజెపి**
**లక్షల కోట్ల రూపాయలను వ్యాపారస్తులకు కట్టబెడుతున్న వైనం**
**ప్రభుత్వాల ఆదినంలోని లొంగుబాటుకే ఎక్కువ ప్రాధాన్యతను కనపరుస్తున్నారు**
**కేంద్రం మాట వినకపోతే పుట్టగతులు లేకుండా చేస్తున్నారు**
**దుబారా పాలనలో దేశముదురులుగా ఎదుగుతున్నారు**
**రాజకీయం వ్యాపారమైపోతుంది**

డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

భారతదేశంపై జరుగుతున్న నమ్మకద్రోహానికి హద్దులు లేకుండా పోతున్నాయని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.రాజకీయ పదవులను అధిరోహిస్తున్న సందర్భంలో ప్రతి రాజకీయ నాయకుడు ప్రమాణ పూర్వకంగా ప్రజావిశ్వాసానికి కట్టుబడి పని చేస్తామని ప్రమాణాలు చేస్తూనే దేశాన్ని దర్జాగా మోసం చేస్తున్నారని హెచ్చరించారు.దేశవ్యాప్తంగా రాజకీయ నాయకులపై నమోదు చేయబడిన ప్రధాన కేసుల వివరాలను పరిశీలించవలసి ఉంటుండగా 4,192 కేసులు నమోదు చేయబడినాయని ప్రజా ప్రతినిధులపై నమోదు చేయబడిన కేసులన్నీ విచారణ పురోగతిలో ఉన్నట్లుగా సంబంధిత అమికస్ క్యూరీ అన్సారియా తమ నివేదిక ద్వారా సుప్రీంకోర్టుకు తెలియజేశారని ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ఎంపీలు ఎమ్మెల్యేలపై దేశవ్యాప్తంగా మొత్తం 4192 కేసులు పెండింగ్లో ఉన్నట్లుగా ఈ నివేదిక ద్వారా వెల్లడించనైనది అన్నారు.2025 నాటికి సుమారు 1243( ఒక వెయ్యి రెండు వందల నలభై మూడు) కేసులు విచారణ పూర్తికాగా అదే సంవత్సరంలో కొత్తగా మరో1050 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా రాజకీయ నాయకులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని రాజకీయ నాయకులు పాలిస్తున్న పాలన పట్ల ప్రజలకు ఏమాత్రం విశ్వాసం లేకపోవడం దేశాన్ని పాలిస్తున్న రాజకీయ నాయకుల పాలనను ప్రజా వ్యతిరేక పాలనగా అభివర్ణించారు.2008లో బాంబే 26/11 టెర్రర్ ఎటాక్ కు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర హోం శాఖ మంత్రి శివరాజ్ పాటిల్ తన పదవికి రాజీనామా చేసినట్లు చరిత్రలు చెబుతున్నాయన్నారు.ప్రస్తుత బీజేపీ హయాంలో పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి అమీషా రాజీనామా చేయాల్సింది పోయి తనకేం సంబంధం లేనట్లుగా పదవిలో కొనసాగుతూ ఉండడం దేశ ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు.అధికార పదవులను కాపాడుకోవడం కోసం దేశానికి ద్రోహం చేయడానికి దేశ ప్రజలు ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు.అత్యున్నతమైన పదవులలో కొనసాగుతూ దేశ భద్రతకు దేశ సమగ్రతకు సమర్ధవంతమైన పరిపాలనను అందించాల్సింది పోయి దేశంలో జరుగుతున్న బాంబుల పేలులకు, ఉగ్రవాద దాడులకు సరియైన విచారణతో కూడిన ఆధారాలను బయట పెట్టకుండా తప్పించుకుంటున్నారని అదే సందర్భంలో ఉగ్రవాద దాడులకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని సూటిగా నిలదీశారు.దేశంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న దాడులకు అల్లర్లకు గొడవలకు బాధ్యత వహించాల్సింది ముమ్మాటికి కేంద్ర ప్రభుత్వమే అంటూ గుర్తు చేశారు.

**దాడుల సమయాల్లో డైవర్షన్ పాలిటిక్స్.**

12 సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి దేశంలో పలు సందర్భాల్లో భయంకరమైన విపత్తు కాలాలు ఏర్పడుతున్న సందర్భాల్లో దేశ ప్రజలు చేస్తున్న ఉద్యమాలకు దేశంలోని రైతులు చేస్తున్న పోరాటాలకు దేశంలోని షెడ్యూల్ కులాలు వాళ్ల ఉనికి కోసం పాకులాడుతున్న విధానాల పైన కష్టకాలంలో ఉన్న కార్మికులు ధర్నాల నిర్వహిస్తున్న సందర్భంలో,దేశవ్యాప్తంగా నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కొట్లాడుతున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ,ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రతి సందర్భంపై కిరాతకంగా దాడులు చేయించడం ఆనవాయితీగా మారిపోయిందన్నారు.బిజెపి ప్రభుత్వంలో డైవర్షన్ పాలిటిక్స్ కి కొదవలేదని దేశ ప్రజలను మభ్యపెడుతూ ఎప్పటికప్పుడు పరిపాలన పద్ధతులను ప్రభుత్వానికి అనుకూలంగా మలుచుకుంటూ దేశ ప్రజలను మోసం చేయడంలో బిజెపి ప్రభుత్వం దిట్టగా మారిపోయిందన్నారు.ఈ మధ్యకాలంలో పార్లమెంట్లో ప్రవేశపెట్టిన 150 సంవత్సరపు వందేమాతరం బిల్లు దేశభక్తి ఉనికిని చాటి చెప్పడం కోసం ఏర్పాటు చేయబడినది కాదన్నారు.కేవలం రాజకీయ నాటకం కోసం ఏర్పాటు చేసుకున్నదిగా దేశ ప్రజలు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నట్లు తెలిపారు. వందేమాతర బిల్లులో లోపాలను పసిగట్టాల్సి వచ్చినప్పుడు బావ స్వేచ్ఛ ప్రకటనకు భంగం కలిగించే విధంగా ఉందని వందేమాతరం పాడకపోతే జైలు శిక్ష అనే శిక్షలను ఖరారు చేస్తూ ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన విధంగా అమల్లోనికి తీసుకొచ్చారన్నారు.చట్టాల దుర్వినియోగం రూపంలో వ్యతిరేకత భావాలు ఉన్నవారిని దేశద్రోహులుగా పరిగణించే ఆస్కారం ఉంటుందన్నారు.భారత రాజ్యాంగం విలువలకు వ్యతిరేకంగాను రూపుమార్చి మనస్సాక్షి స్వేచ్ఛకు, మత స్వేచ్ఛకు భంగం కలిగించే బిల్లుగా రూపొందించినట్లు ఆవేదన చెందారు.ఈ విధంగా దేశపాలనలో అసలైన సమస్యలు, ఉద్యోగాలు, ధరల పెరుగుదల, విద్య, ఆరోగ్యం, వంటి సమస్యలపై ఏమాత్రం దృష్టి పెట్టకుండా ప్రజల మనసుకు వ్యతిరేకంగా బిల్లు ప్రవేశపెట్టడం జరిగిందని వాపోయారు.ఇటు బిల్లులో సమానత్వం పూర్తిగా లోపించిందని వందేమాతరం బిల్లు అనేది అందరికీ సమానంగా వర్తిస్తుందా కొందరికే వర్తిస్తుందా ప్రభుత్వం దగ్గర సమాధానం లేదన్నారు.ఏ బిల్లు అయినా ప్రవేశపెట్టేముందు బిల్లు ముఖ్య లక్ష్యాలను, సూత్రాలను, ఆచరణను, అమలును, దేశ ప్రజలకు ముందస్తుగానే తెలియజేయాల్సి ఉంటుండగా కేవలం ఆగస్టు 15 2026 ను దృష్టిలో పెట్టుకొని వందేమాతరం బిల్లును ప్రవేశపెట్టినారని రాజకీయ నాయకులు భావిస్తూ ఉంటుండగా ఢిల్లీలో జరిగిన జంతర్ మంతర్ ఉద్యమాల్లో దేశవ్యాప్తంగా విద్యార్థులపై జరిగిన కఠినమైన ,అక్రమ కేసులు ఉద్యమ తీవ్రతను దారి మళ్ళించడం కోసం మాత్రమే బిల్లు అమల్లోకి తీసుకొచ్చారని సూటిగా గుర్తు చేశారు.దేశంలో ద్రోహం అనేది అన్నీ తెలిసిన విధంగానే ప్రబలిపోతుందని అందులో భాగంగానే వందేమాతరం సరిగా పాడరాని పెద్దపెద్ద నాయకులు అందరూ వందేమాతరం బిల్లును తీసుకొస్తున్నామంటూ దేశ ప్రజలకు తెలియజేయడంలో అర్థం లేదన్నారు.జాతీయ జెండాను జాతీయ జెండా విలువను భారత దేశ జాతీయత గౌరవించలేని వాళ్ళు దేశ గౌరవం పట్ల మాట్లాడడం దేశ జాతీయత పట్ల మాట్లాడడం వికారంగా ఉందన్నారు.దేశభక్తి అనేది మనసులో ఉండాలి కానీ చట్టాల రూపంలో బలవంతపు ఒత్తిడి తీసుకువస్తామనడం పచ్చి మోసమన్నారు.జాతీయ గీతాన్ని గౌరవించాలనేది 140 కోట్ల మంది ప్రజల బాధ్యతగా గుర్తు చేస్తూ బలవంతంగా ప్రయోగం చేయడం సరైన కాదన్నారు.దేశంలో జాతీయగీతంపై గౌరవం ఎంతవరకు ఉందో ఎంత మందికి లేదో స్పష్టత లేదని 150 సంవత్సరాలలో కనీసం 58 సంవత్సరాలు జాతీయ జెండాకు దూరం ఉన్నటువంటి సంస్థలు కూడా జాతీయతపై మాట్లాడడం చండాలంగా ఉందన్నారు.1982లో ఏర్పడిన జాతీయస్థాయి పార్టీ స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అవుతున్న కేవలం 44 సంవత్సరాలు మాత్రమే జాతీయ జెండాపై సమానత్వం లేని ప్రేమను కనపరచినట్లు దేశ పాలన తెలియజేస్తుందన్నారు.ఇకనైనా ప్రజల సమస్యలపై దృష్టి పెడుతూ రాజకీయ నాటకాలు మానాలని సూచించారు.ప్రజల ఐక్యతను దెబ్బతీస్తూ ప్రజల గుండెలను చదరగొట్టొద్దని గుర్తు చేస్తూ దేశంలో పెరిగిపోతున్న నమ్మకద్రోహాల పట్ల విద్యార్థులు, మేధావులు, జర్నలిస్టులు, కవులు, కళాకారులు, రాజకీయ విశ్లేషకులు, దేశ ప్రజలకు అండగా నిలవాలని దేశ ప్రజలను మోసం చేస్తున్న నాయకులందరినీ రాజకీయ సన్యాసం పుచ్చుకునే విధంగా చేయాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వంపై దేశ ప్రజలకు విశ్వాసం పూర్తిగా సన్నగిల్లుతుందని అందులో భాగంగానే రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను బలవంతంగా అమలుపరుస్తూ దేశంలో ప్రజా వ్యతిరేక ద్రోహాన్ని పెంపొందిస్తున్నారని మండిపడ్డారు.దేశంలో నిరుద్యోగులు చేస్తున్న ఉద్యమాల పట్ల ప్రపంచ దేశాలే గర్వపడుతుంటే దేశంలోని ప్రధాన రాజకీయ వర్గాలు వాళ్ల అనుచరులు ఇతర దేశాలతో ఇతర మతస్తులతో పోలుస్తూ అల్పానందం పొందుతూ దేశ జాతీయతను దేశ గొప్పతనాన్ని దేశ గౌరవాన్ని అవమాన పరుస్తూ అగౌరవపరుస్తున్నారన్నారు.

# వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు - డీసీపీ దారా కవిత







**రూ.12 లక్షల చోరీ సొత్తు స్వాధీనం**

**వరంగల్, 24 ఆగస్టు 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను మిల్స్‌కాలనీ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 70.19 గ్రాముల బంగారు ఆభరణాలు, 527.9 గ్రాముల వెండి, రూ.29,875 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల (27) ప్రస్తుతం మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో నివసిస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పగటి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రివేళల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస చోరీలపై కేసులు నమోదు కావడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం ఉదయం అనుమానాస్పదంగా ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో 2024, 2025 సంవత్సరాల్లో మహారాష్ట్రలో నాలుగు చోరీలకు పాల్పడిన నిందితుడిని అక్కడి పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. అనంతరం బెయిల్‌పై విడుదలైనప్పటికీ తన పద్ధతిని మార్చుకోకుండా మళ్లీ చోరీలకు పాల్పడ్డాడు. ఈ ఏడాది మిల్స్‌కాలనీ పరిధిలోని శివనగర్, ఎస్.ఆర్.ఆర్. నగర్ ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు అతని నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత మాట్లాడుతూ.. సాంకేతిక ఆధారాలతో వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడి నుంచి భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. తాళం వేసి ఇళ్లను ఖాళీగా ఉంచే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఎస్ఐ మహేష్, ఏఏఓ సల్మాన్ పాషాతో పాటు సీసీఎస్, మిల్స్‌కాలనీ పోలీసు సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# టాస్ అడ్మిషన్లపై డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఓరియంటేషన్

**వరంగల్, 24 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

టాస్ అడ్మిషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు వరంగల్ జిల్లాలోని మండల సమాఖ్య డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అడ్మిషన్ ప్రక్రియపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా టాస్ కో ఆర్డినేటర్ అనగోని సదానందం, ఏపీఎం రాజు, వివిధ మండలాలకు చెందిన మండల సమాఖ్య డాటా ఎంట్రీ ఆపరేటర్లు, వరంగల్ జిల్లా టాస్/ఉల్లాస్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, హనుమకొండ జిల్లా కో ఆర్డినేటర్ చల్లా రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టాస్ డాటా ఎంట్రీ ఆపరేటర్ అవినాష్ అడ్మిషన్ ప్రక్రియ, ఆన్‌లైన్ నమోదు విధానం, అవసరమైన పత్రాలను అప్లోడ్ చేయడం, అడ్మిషన్లను సమర్థవంతంగా పూర్తి చేసే



విధానంపై డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సమగ్ర శిక్షణ అందించారు. నిర్దేశిత గడువులోగా టాస్ అడ్మిషన్ల లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు, అర్హులైన ప్రతి అభ్యర్థికి విద్యావకాశాలు అందేలా అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలని కార్యక్రమంలో సూచించారు.

## ఎస్సీ వెల్ఫేర్ కమిటీ ప్రిలిమినరీ సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హైద్రాబాద్, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో సోమవారం నిర్వహించిన ఎస్సీ వెల్ఫేర్ కమిటీ ప్రిలిమినరీ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. సంబంధిత సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై సభ్యులు అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండి ప్రకాష్‌తో పాటు శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీపీ మండల్ 108వ జయంతి వేడుకలకు ఏర్పాట్లు




**వరంగల్, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం బీసీ సెల్ ఆధ్వర్యంలో బీపీ మండల్ 108వ జయంతి వేడుకలను ఆగస్టు 25న నిర్వహించనున్నట్లు బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బి. సతీష్ తెలిపారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవన ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని డాక్టర్ బి. సతీష్ ఒక ప్రకటనలో కోరారు.

## మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద


**వరంగల్, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. సోమవారం మట్టేవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భోజనం తయారీ, వడ్డింపు సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజనంలో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.




## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### పెండింగ్‌లో ఉంచితే చర్యలు తప్పవు: కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా అత్యవసరంగా పరిగణించి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి పోర్టల్‌లో వివిధ శాఖలకు సంబంధించిన పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. సీఎం ప్రజావాణి దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, తీసుకున్న చర్యలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. అర్జీల పరిష్కారానికి సంబంధించిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సక్రమంగా లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సమయానికి హాజరు కావాలని, కారుణ్య నియామకాల భర్తీకి శాఖల వారీగా వివరాలను అందించాలని ఆదేశించారు. మంగళవారం నిర్వహించనున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లోనూ ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించారు. వన మహోత్సవం కార్యక్రమానికి సంబంధించిన వివరాలను జిల్లా అటవీ శాఖ అధికారి ముకుంద రెడ్డి అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీవో మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత కీలకం



**వరంగల్, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, భద్రతలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో కీలకమని కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ సొసైటీ చైర్మన్ డా. అనితారెడ్డి అన్నారు. వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఫీక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డా. అనితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఇంటితో పాటు పాఠశాలలోనూ ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. చిన్ననాటి నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం, మంచి చెడుల మధ్య తేడా తెలుసుకునేలా పిల్లలకు మార్గనిర్దేశం చేయాలన్నారు. పిల్లల స్నేహ సంబంధాలను కూడా తల్లిదండ్రులు గమనిస్తూ, భవిష్యత్తుకు ఉపయోగపడే మంచి స్నేహాలను ప్రోత్సహించాలని సూచించారు. పిల్లలతో తల్లిదండ్రులు తగినంత సమయం గడపాలని, మొబైల్ ఫోన్ల వినియోగంపై నియంత్రణ పాటించాలని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించి, వారి సూచనలు పాటిస్తూ మంచి నైతిక విలువలను జీవితంలో ఆచరించాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరించే అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వారి వద్దకు వెళ్లకుండా వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల భద్రత కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం సమన్వయంతో పనిచేయాలని డా. అనితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు, మాజీ బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ వరంగల్ మండల పరశురాములు, ఉపాధ్యాయులు వెంకన్న, లక్ష్మపతి, కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన అపరాజిత ప్రీతి

**వరంగల్, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధకురాలు అపరాజిత ప్రీతి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్‌ను ప్రకటించారు. అపరాజిత ప్రీతి "ఉద్యోగుల భావోద్వేగ మేధస్సు మరియు పని పనితీరు -- ఎంపిక చేసిన బ్యాంకుల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులపై ఒక అధ్యయనం" అనే అంశంపై పరిశోధన చేశారు. విభాగ ఆచార్యులు ఆచార్య పి. అమరావేణి పర్యవేక్షణలో ఆమె తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. భూపాలపల్లికి చెందిన అపరాజిత ప్రీతి డాక్టరేట్ పొందడంపై కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# కేయూలో రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదుకు ప్రత్యేక దృష్టి


**హన్మకొండ, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు విశ్వవిద్యాలయ రెడ్‌క్రాస్ నోడల్ ఆఫీసర్ ఆచార్య ఈసం నారాయణ తెలిపారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో నిర్వహించిన జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశంలో రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదుపై ప్రత్యేకంగా చర్చించారు. సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేసి, విశ్వవిద్యాలయం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు చేపట్టినట్లు ఆచార్య నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు, ఇతర భాగస్వాములు రెడ్‌క్రాస్‌లో శాశ్వత లేదా సాధారణ సభ్యులుగా నమోదు చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి








**హన్మకొండ, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. హనుమకొండ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయడంతో పాటు వాటి మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని తెలిపారు. చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటాలని, నాణ్యమైన మొక్కలను మాత్రమే వినియోగించాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పిస్తూ మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. వన మహోత్సవం కింద హనుమకొండ జిల్లాలో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

## వడ్డేపల్లిలో టీబీపై అవగాహనతో పాటు ఉచిత పరీక్షలు





**హన్మకొండ, 24 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఫేజ్--2లో భాగంగా వడ్డేపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో సోమవారం టీబీ నిక్షయ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌రే స్క్రీనింగ్, కఫం పరీక్షలు నిర్వహించడంతో పాటు టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. 14 సంవత్సరాలు పైబడిన పిల్లలు, వృద్ధులు, మద్యపానం, ధూమపానం చేసే వారు, హెచ్‌ఐవీ బాధితులు, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 18 కంటే తక్కువగా ఉన్నవారు, టీబీ బాధితులతో సన్నిహితంగా ఉన్న వారిని గుర్తించి ప్రత్యేకంగా పరీక్షించారు. శిబిరంలో ఎన్‌సీసీ విద్యార్థులు టీబీ వాలంటీర్లుగా పాల్గొని సేవలందించారు. ఇన్‌చార్జి డీటీసీవో డా. ప్రదీప్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డా. మాలిక, ఎన్‌సీసీ అధికారి దీపక్‌తో పాటు టీబీ సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, రేడియోగ్రాఫర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పింగిలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు పరిశోధన కేంద్రం హోదా



**హన్మకొండ, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని వడ్డేపల్లిలో ఉన్న పింగిలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు పరిశోధన కేంద్రం హోదా లభించింది. కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పింగిలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లోని మైక్రోబయాలజీ విభాగాలకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు డా. జి. రేణుక, డా. పి. పల్లవిలను పరిశోధన పర్యవేక్షకులు (రీసెర్చ్ సూపర్వైజర్స్)గా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాస్, పింగిలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చంద్ర మౌళిని విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు. ఈ నిర్ణయంతో కళాశాలల్లో పరిశోధన కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు విద్యార్థులకు ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో మెరుగైన అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఓఎస్డీ ఆచార్య బి. వెంకటరాం రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, దూరవిద్య కేంద్ర సంచాలకులు ఆచార్య బి. సురేష్‌లాల్, మైక్రోబయాలజీ విభాగాధిపతి ఈ. సుజాత, డా. జి. సుహాసిని, డా. కే. రజనీలత తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజుల వసూళ్లపై విద్యార్థుల ధర్నా




**హన్మకొండ, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈలో అడ్మిషన్ల సమయంలో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సిగ్గుచేటని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బి. వంశీకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఎంబీఏ (ఎస్ ఎఫ్.సీ) మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ.. కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో రూ.13 వేల ఫీజు చెల్లించారని తెలిపారు. అయినప్పటికీ అడ్మిషన్ కోసం అదనంగా రూ.7 వేలు వెంటనే చెల్లించాలని, లేకపోతే అడ్మిషన్ ఇవ్వబోమని ఎస్‌డీఎల్‌సీఈ అధికారులు చెప్పడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థుల నుంచి ఒక్కసారిగా పూర్తి సెమిస్టర్ ఫీజు వసూలు చేయడం వల్ల ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దూరవిద్యలో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతున్న సమయంలో ఇలాంటి నిర్ణయాలు ఎస్‌డీఎల్‌సీఈపై విద్యార్థుల్లో నమ్మకాన్ని మరింత దెబ్బతీస్తాయని అన్నారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ విద్యార్థులతో మాట్లాడి, వారి నుంచి పూర్తి స్థాయి ఫీజులను ఒకేసారి వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వంశీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్, చైతన్య, చిన్న రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలతో కాకతీయ విశ్వవిద్యాలయ ప్రతిష్టను పెంచాలి

వీసీ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి






**హన్మకొండ, 24 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాల ద్వారా కాకతీయ విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింత పెంచాలని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ విద్యా విధానం--2020లో విద్యతో పాటు విలువలు, నైపుణ్యాలు, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. 'వికసిత్ భారత్--2047', 'రైజింగ్ తెలంగాణ' లక్ష్యాలకు అనుగుణంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను రూపొందించి, యువతను సామాజిక అభివృద్ధిలో చురుకుగా భాగస్వాములను చేయాలని సూచించారు. సాంకేతికత, కృత్రిమ మేధస్సు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయుల పాత్ర తరగతి గదికే పరిమితం కాకూడదని అన్నారు. విద్యార్థుల్లో అడాప్టబిలిటీ, ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి నైపుణ్యాలను పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌తో హైదరాబాద్ లోక్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఇచ్చిన సూచనల మేరకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 'నషా ముక్త్ భారత్', రెడ్‌క్రాస్ సభ్యత్వం, 'మై భారత్' పోర్టల్ నమోదు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో విశ్వవిద్యాలయం చేసుకున్న అవగాహన ఒప్పందాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విశ్వవిద్యాలయ నిధులతో ఎంపానెల్డ్ సంస్థల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సభ్యత్వం, 'మై భారత్' పోర్టల్ నమోదుకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో కాకతీయ విశ్వవిద్యాలయం ఇతర విద్యాసంస్థలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ శ్రీజా జాతీయ స్థాయి యువ పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. గత ఏడాది మేడారం జాతరలో వాలంటీర్లు పాల్గొన్నారని, 170 ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాల పరిధిలో యువ పార్లమెంట్ కార్యక్రమాలతో పాటు విశ్వవిద్యాలయ స్థాయి యువ పార్లమెంట్ నిర్వహించి విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయికి ప్రోత్సహించినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డా. ఎం. రాంబాబు, జనగామ జిల్లా కన్వీనర్ డా. వి. శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ ఎం. అనిల్‌కుమార్, ములుగు జిల్లా కన్వీనర్ సీహెచ్. ప్రసన్నకుమార్, భూపాలపల్లి జిల్లా కన్వీనర్ ఎం. యుగేందర్, క్యాంపస్ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ డా. టి. రాధిక, న్యాయ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ డా. వై. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పదవి కంటే పార్టీ కోసం పని చేయడమే లక్ష్యం

భీమ వినయ్ కుమార్





**హన్మకొండ, 24 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

9వ డివిజన్‌కు చెందిన భీమ వినయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీని తన నరనరాల్లో నింపుకొని, పదవులతో సంబంధం లేకుండా పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డివిజన్‌లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ పార్టీ కార్యకర్తలకు, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. "పదవులు ముఖ్యమైనవి కావు.. పనులే ముఖ్యమైనవి" అనే నినాదంతో భీమ వినయ్ కుమార్ పనిచేస్తున్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై విశ్వాసంతో ప్రజల్లోకి వెళ్తున్నారు. 9వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారు. తనకు వచ్చిన అవకాశాలను వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా పార్టీ, ప్రజల కోసం వినియోగించాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. పదవి ఉన్నా లేకపోయినా పార్టీ కోసం పనిచేయాలనే తపనతో అనేక కార్యక్రమాలు చేపడుతూ, ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తున్న భీమ వినయ్ కుమార్ 9వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి బలమైన కార్యకర్తగా తన ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్నారు. 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి తన శక్తి మేరకు నిరంతరం పనిచేస్తానని, పార్టీకి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భీమ వినయ్ కుమార్ తెలిపారు. తనకు ఈ బాధ్యత దక్కేందుకు సహకరించిన ఇనిగాల వెంకట్రామిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, 9వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ప్రత్యేక అవసరాల విద్యార్థుల అభ్యున్నతికి సమష్టి కృషి అవసరం





### జిల్లా విద్యాశాఖ అధికారి గిరి రాజ్ గౌడ్

**హన్మకొండ, 24 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు (సీడబ్ల్యూఎస్ఎన్), వారి తల్లిదండ్రుల కోసం హనుమకొండ జిల్లా స్థాయిలో తల్లిదండ్రుల అవగాహన, ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరి రాజ్ గౌడ్, జిల్లా సమన్వయకర్తలు మహేష్, మన్‌మోహన్, ప్రత్యేక విద్యా సమన్వయకర్త ఇ. సుమాదేవి, ఐఈఆర్‌పీలు, ప్రత్యేక ఉపాధ్యాయులు, సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ గిరి రాజ్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన ప్రతి విద్యార్థికి సమాన విద్యా అవకాశాలు కల్పించడమే విద్యాశాఖ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయక పరికరాలు, విద్యా అవకాశాలు, రవాణా సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు, వివిధ సంక్షేమ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి తగిన సహాయం అందించడం, పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా ప్రోత్సహించడం, వారి ప్రతిభను వెలికితీయడం వంటి అంశాలపై తల్లిదండ్రులకు మార్గదర్శనం చేశారు. "ప్రతి సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థికి సమాన అవకాశాలు -- సమగ్ర విద్యతో ఉజ్వల భవిష్యత్తు" అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# నీట్ (పీజీ)-2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు





### పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హన్మకొండ, 24 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ఈ నెల 30న జరగనున్న నీట్ (పీజీ)-2026 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నీట్ (పీజీ)-2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నీట్ (పీజీ)-2026 కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఈ నెల 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. హనుమకొండ జిల్లాలోని నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ (హసన్‌పర్తి), మోక్షిత్ కంప్యూటర్స్ (రామారం), అయాన్ డిజిటల్ జోన్ (వడ్డేపల్లి) కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష నిర్వహణ కోసం ముగ్గురు అధికారులను చీఫ్ సూపరింటెండెంట్లుగా, ఒకరిని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిగా, ముగ్గురిని సిట్టింగ్ స్క్వాడ్ అధికారులుగా నియమించినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 8.30 గంటల తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ దార కవిత, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీ శంకర్, ఎన్పీడీసీఎల్ ఏఈ అలేఖ్య, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు, ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువతి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

### గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసుల ఎదుట అంగీకారం





**హన్మకొండ, 24 ఆగస్టు 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ఎల్కతుర్తిలో కారులో యువతి మృతదేహం లభించిన కేసును పోలీసులు ఛేదించారు. గోదావరిఖనికి చెందిన మానసను గొంతు నులిమి హత్య చేసినట్లు నిందితుడు ఏడేల్లి వినోద్‌కుమార్‌రెడ్డి అంగీకరించినట్లు కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 21న ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు సమీపంలో పార్క్ చేసిన కారులో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కారు డిక్కీలో మానస మృతదేహాన్ని గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు ఈ నెల 23న వినోద్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మానస తనకు చిన్ననాటి నుంచి పరిచయమున్నట్లు నిందితుడు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. మానసను హత్య చేయాలని ఆమె తండ్రి అంకతి రాజేశం తనను సంప్రదించి డబ్బులు పంపినట్లు నిందితుడు చెప్పినట్లు ఏసీపీ తెలిపారు. ఈ నెల 18న మానస తనను పెళ్లి చేసుకోవాలని కోరడంతో, అనంతరం ఆమెను గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని కారులో ఎల్కతుర్తికి తీసుకొచ్చి వదిలినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ పులి రమేష్, ఎస్సై నరసింహారావు, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

# 25 మంది అధికారులు.. 5 దరఖాస్తులే..

### హసన్‌పర్తి ప్రజావాణిపై చర్చ





**హసన్‌పర్తి, 24 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం హసన్‌పర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన 25 మంది మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అయితే ఇంతమంది అధికారులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజల నుంచి మొత్తం 5 దరఖాస్తులు మాత్రమే రావడం చర్చనీయాంశంగా మారింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుమనా వాణి నోడల్ అధికారిగా నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య, వ్యవసాయం, పశుసంవర్ధక, వైద్య, మైనార్టీ సంక్షేమం, హౌసింగ్, ఇంజినీరింగ్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు 4, గృహనిర్మాణ శాఖ 1 మొత్తం 5 దరఖాస్తులు అందాయి. అయితే మండల పరిధిలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ ప్రజావాణికి దరఖాస్తుల సంఖ్య పరిమితంగా ఉండటంపై పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రజావాణి కార్యక్రమంపై గ్రామస్థాయిలో తగినంత ప్రచారం జరిగిందా? కార్యక్రమం నిర్వహించే సమయం, స్థలం, వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉంటారనే సమాచారం ప్రజలకు ముందుగానే చేరిందా? అనే అంశాలపై చర్చ జరుగుతోంది. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రజావాణిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తే మరింత మంది ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించడం మాత్రమే కాకుండా, వాటిపై సకాలంలో చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించడం కూడా ముఖ్యమని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో అందిన 5 దరఖాస్తులపై సంబంధిత శాఖలు ఎలాంటి చర్యలు తీసుకున్నాయి, ఎన్ని పరిష్కరించారు, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అనే వివరాలను తదుపరి ప్రజావాణిలో వెల్లడించాలని కోరుతున్నారు. ఒకే వేదికపై 25 మంది అధికారులు అందుబాటులో ఉండటం ప్రజలకు ఉపయోగకరమైన అవకాశమే అయినప్పటికీ, కార్యక్రమానికి ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం ఆలోచించాల్సిన అంశంగా మారింది. ప్రజావాణి ఉద్దేశ్యం ప్రజల సమస్యలను గుర్తించి వాటికి త్వరితగతిన పరిష్కారం చూపడమే కాబట్టి, గ్రామస్థాయిలో మరింత ప్రచారం నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. ప్రజావాణి కేవలం దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమంగా కాకుండా ప్రజల సమస్యలకు కాలపరిమితిలో పరిష్కారం చూపించే వేదికగా మారాలని ప్రజలు కోరుతున్నారు. 25 మంది అధికారులు హాజరైన కార్యక్రమానికి 5 దరఖాస్తులు మాత్రమే రావడంతో, రానున్న ప్రజావాణి కార్యక్రమాల్లో ప్రజల స్పందన ఎలా ఉంటుందో, ప్రస్తుతం అందిన దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు ఎంత వేగంగా చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# బాలికల గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

**హసన్‌పర్తి, 24 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్))**




హనుమకొండ జిల్లా పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026--27 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు హనుమకొండ డీసీఓ సుధాకృష్ణ తెలిపారు. కమ్యూనిటీ, కులం తదితర నిబంధనల ప్రకారం అర్హత కలిగిన బాలికలకు సీట్లు కేటాయించేందుకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత ఉన్న బాలికలు ఆగస్టు 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మడికొండలోని బాలికల గురుకుల పాఠశాలకు హాజరై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించి, అర్హత మరియు అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు డీసీఓ తెలిపారు. అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# తెలంగాణ పెట్టుబడులను అడ్డుకునే కుట్ర

**గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోడీ**
**సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం**
**అమెరికా టూర్ రద్దును ఊరికే వదలబోం**
**పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది**
**నన్ను అడ్డుకున్నా..నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు**
**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ మండిపాటు**

**హైదరాబాద్,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిం దని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అయితే అందుకు విరుద్ధంగా కేంద్ర విధానాలు ఉన్నాయని అన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం 4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిందని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగరేణి అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు

**కొత్త బొగ్గు గనులు ప్రారంభించాలి**
**సంస్థకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి**
**సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించాలి**
**కార్మికుల సమస్యలను పరిష్కరించాలి**
**లాభాల వాటా ప్రకటించాలని డిమాండ్**



**హైదరాబాద్, ఆగస్టు 24 (జై భీమ్ న్యూస్):**

సింగరేణి సంస్థ అభ్యున్నతి, కార్మికుల సంక్షేమం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ కోరారు. సోమవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘాలు, అధికారుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రస్తుత పరిస్థితులు, కార్మికుల సమస్యలు, సంస్థ భవిష్యత్ అభివృద్ధికి అవసరమైన చర్యలను జనక్ ప్రసాద్ మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్ అవసరాల కోసం కొత్త బొగ్గు గనులను ప్రారంభించాలని, ప్రభుత్వం, విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన మొండి బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సింగరేణికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హోదా కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల ప్రోత్సాహక భత్యాలపై ఆదాయపు పన్ను మినహాయింపు, మారుపేర్ల సమస్య పరిష్కారం, సొంత ఇంటి కల పథకం అమలు, 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా ప్రకటించడం వంటి డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అధికారుల ప్రదర్శన ఆధారిత ప్రోత్సాహకంతో పాటు ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాలు ప్రస్తావించిన సమస్యలపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. సింగరేణి అభ్యున్నతి, సంస్థ భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యంతో చర్చించి కార్మికులు, అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇచ్చిన హామీల అమలుకు కూడా కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఎంఓఏఐ నాయకులు పాల్గొన్నారు.

# హెచ్ఎండిఎ కమిషనర్‌తో రఘునందన్ రావు భేటీ

## పెండింగ్ రోడ్డు, రైల్వే పనుల పూర్తిక అభ్యర్థన

**హైదరాబాద్,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక సమస్యలపై హెచ్ఎండీఏ కమిషనర్, మెట్రో రైల్వే మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసి చర్చించినట్లు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలిపారు. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు పొడిగింపు అంశంపై చర్చించడం జరిగింది. పటాన్‌చెరు ఎగ్జిట్-3 నుంచి ఎగ్జిట్-4, సుల్తాన్‌పూర్ మధ్య పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరడం జరిగింది. కొల్లూరు ఎగ్జిట్-2 వద్ద పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరడం జరిగిందని అన్నారు.

# కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

## దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనలో కొండా సుష్మిత వ్యవహారం

**కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం**
**సోషల్ మీడియాతో బతికేస్తున్న కేటీఆర్**
**మెదక్‌లో కాంగ్రెస్ సమావేశంలో పిసిసి చీఫ్**




**మెదక్,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఎఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# నకిలీ డీఎస్పీగా ప్రజలకు టోపీ

**రూ.1.20 కోట్లు వసూళ్లు**
**వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ. 1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడి పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ హోదాలు, అధికారుల పేర్లు ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 2021 నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న కేవీపీ రాజును ఎట్టకేలకు సీసీఎస్ ఈఓడబ్ల్యూ అధికారులు అరెస్ట్ చేశారు. కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజుపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ డీఎస్పీగా తనను తాను పరిచయం చేసుకుంటూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నారా, అతడి మోసాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అరెస్ట్ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# ఛాంపియన్ షిప్ వేడుకల్లో అపశృతి

**హోంమత్రి అనితకు డ్రోన్ తాకి స్వల్ప గాయం**

**తిరుపతి,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

అమరావతి ఛాంపియన్‌షిప్ ప్రారంభ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. . బ్యాటరీ ఛార్జింగ్ తగ్గిపోవడంతో డ్రోన్ కిందపడిపోయింది. హోంమంత్రి వంగలపూడి అనితపై డ్రోన్ కూలింది. దీంతో మంత్రి కుడి చెయ్యిపై స్వల్ప గాయమైంది. వెంటనే అప్రమత్తమైన వైద్య సిబ్బంది.. అనితకు చికిత్స అందజేశారు. ఒక్కసారిగా డ్రోన్ కూలడంతో కొద్దిసేపు అక్కడ గందరగోళ పరిస్థితి నెలకొంది.

# క్రమశిక్షణ కమిటీకి కొండాసురేఖ వ్యవహారం

**ఇందులో ఎవ్వరు కూడా ఇక మాట్లాడొద్దు**
**సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు**
**రాజకీయ వ్యవహారాలపై ప్రజాప్రతినిధులతో రేవంత్ చర్చ**



**హైదరాబాద్,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ పార్టీ నియమాలకు నేతలంతా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పందించారు. పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ అంశంపై ఎవరూ మాట్లాడొద్దని.. ఇకపై ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని చెప్పారు. సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణను నిర్లక్ష్యం చేయొద్దని నేతలకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావన్నారు. భూసేకరణ, ఫారెస్టు క్లియరెన్సులకి సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టండని ప్రతినిధులకు సూచించారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్లపల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగ మాయి, మందల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లక్ష్మి కాంత రావు,రామ్ దాస్ నాయక్,కడియం శ్రీహరి,డాక్టర్ సంజయ్,బత్తుల లక్ష్మారెడ్డి,మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు పాల్గొన్నారు.

## అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

**ఒక్కచుక్క చమురును కూడా సరఫారా కానివ్వం**
**ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్) :**

అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీ–డే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

## ఇరాన్‌తో ఆట చివరికి వచ్చింది

### యూఎస్ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన

**వాషింగ్టన్,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్) :**

ఇరాన్‌ను ఒంటరిచేయడమే లక్ష్యంగా ఆ దేశంపై ఆర్థిక యుద్ధానికి సిద్ధమైంది అమెరికా. టెహ్రాన్‌కు సాయం చేసే దేశాలపై కఠిన ఆంక్షలు విధించనుంది. ఈ పరిణామాల వేళ అగ్రరాజ్య ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆట చివరికొచ్చిందని, ఇక ఆ దేశానికి ఆర్థిక వినాశనమేనని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలపై మేం గట్టి దెబ్బకొట్టాం. ఆ దేశ సైనిక ఫ్యాక్టరీలను 100శాతం ధ్వంసం చేశాం. అణు కార్యక్రమాన్ని సమాధి చేశాం. ఇక ఆట చివరికొచ్చింది. ఏ శత్రువుపైనా ఇప్పటివరకు చేపట్టని అతిపెద్ద ఆర్థిక యుద్ధాన్ని ప్రారంభించబోతున్నాం. భద్రతా హామీల ముసుగులో ఇన్నాళ్లూ ఇరాన్ బెదిరింపులు చేస్తూ మనుగడ సాగించింది. అమెరికా తమనేమీ చేయలేదని భావించింది. కానీ, ఇప్పుడు ట్రంప్. హయాంలో ఆ శకం ముగిసింది. టెహ్రాన్‌ను ఒంటరి చేసేవరకు.. ఆ నిరంకుశ పాలనను నిలబెడుతున్న ప్రతి ఆర్థిక జీవనాధారాన్ని తెంచడమే మా లక్ష్యం అని స్కాట్ బెసెంట్ రాసుకొచ్చారు. ఇరాన్‌కు ఆర్థికంగా సహకారం అందిస్తోన్న దేశాలు తీవ్ర పర్యవసనాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇటీవల ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దేశంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించే ప్రతి సంస్థ, ఏజెన్సీని తాము లక్ష్యంగా చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ఆర్థిక యుద్ధం సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్కాట్ బెసెంట్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## యువతే దేశ భవిష్యత్‌కు కీలకం

**20వేల మంది యువతతో మాటామంతీ: కోటంరెడ్డి**

**నెల్లూరు,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్) :**

స్వామి వివేకానంద, శ్రీశ్రీ చెప్పినట్టు యువత పాత్రే దేశానికి కీలకమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నేడు యువత.. దేశ భవిష్యత్తు కోసం ఆలోచిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులన్న తేడా లేకుండా యువత రాజకీయ నాయకులను ప్రశ్నిస్తోందని.. ఇది మంచి నిర్ణయమని.. దీన్ని తాను కూడా స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 20 వేల మంది జెన్‌జీ యువతతో 55 రోజుల పాటు 51 చోట్ల మాటామంతి నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళవారం ఉదయం నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ, ఏపీ ముఖ్యమంత్రి.. దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలపై చర్చ నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఎన్నో వ్యయప్రయాసలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిపై చర్చ ఉంటుందన్నారు. యువత ఉద్యోగాలకు సంబంధించి ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. సీఎం చంద్రబాబు ముందు చూపుతో తీసుకొచ్చిన కంప్యూటర్ వలనే ఉద్యోగాలు వస్తున్నాయని తెలిపారు. మాటామంతి కార్యక్రమంలో బహిరంగంగా మాట్లాడలేని వారికి ఫోన్ నంబర్, మెయిల్ ఐడి ద్వారా తనతో చర్చించవచ్చని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.

## అపార్ట్‌మెంట్ ఐదో అంతస్థు నుంచి దూకిన యువతి

**అక్కడిక్కడే మృతి...దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**హైదరాబాద్,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీలో విషాదం చోటుచేసుకుంది. డిప్రెషన్‌తో ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కేపీహెచ్‌బీ ఎస్సై శశిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కానూర్‌కు చెందిన సోను పురుషోత్తమన్, శీతల్ భార్యాభర్తలు. ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల చిన్నారి ఉంది. పురుషోత్తమన్ ఎస్‌బీఐలో డీఎంగా పనిచేస్తున్నారు. భార్య, కుమార్తె, తల్లిదండ్రులతో కలిసి కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో శీతల్ (32) టెర్రస్ ఎక్కే మెట్లపై 10 నిమిషాలు పాటు కూర్చుంది. తర్వాత టెర్రస్ పైకి ఎక్కి అపార్ట్‌మెంట్ గేటు ఆవరణలోకి దూకేసింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ బలవన్మరణానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. ఆమె భర్తతో పాటు కేరళలో ఉన్న సోదరుడితోనూ మాట్లాడారు. శీతల్ కొంత కాలంగా డిప్రెషన్‌తో బాధపడుతోందని.. దీనికి మందులు వినియోగిస్తున్నట్లు వారు పోలీసులకు తెలిపారు. కేరళలో ఉన్న శీతల్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

## ఏఈ కుటుంబంపై మాతమార్పిడి కోసం ఒత్తిడి

**సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు**
**రెండు వేర్వేరు సూసైడ్ లేఖలు స్వాధీనం**
**జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వెల్లడి**

**కాకినాడ,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ రెండింటిలోనూ రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్‌ఖాన్ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొనడంతో అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరిలో దూకారు. రియాన్స్ ప్రాణాలతో బయటపడగా మిగిలిన ముగ్గురు మృతిచెందారు. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. నూకరాజు వద్ద, సౌజన్య స్కూటీలో రెండు సూసైడ్ నోట్‌లు దొరికాయి. మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడని ఎస్పీ వెల్లడించాడు. ఆమె మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పీఎస్‌లో కేసు నమోదు చేయగా, నిందితుడు సాధిక్‌ఖాన్ కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లోగాలింపు చేపట్టామని అన్నారు. చివరికి యూపీలోని మేరఠ్‌లో అతడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేశాం. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై కాకినాడ తీసుకొచ్చామన్నారు. నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారై మేరఠ్ చేరుకున్న సాధిక్.. స్నేహితులకు మాయమాటలు చెప్పి ఆశ్రయం పొందాడు. ఫోన్, డబ్బు పోయినట్లు వారికి చెప్పాడు. అతడిపై వస్తోన్న మరికొన్ని ఆరోపణలపై విచారణ జరుగుతోంది. నిర్ధారణ అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తాం. హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద సాధిక్‌పై కేసులు నమోదు చేశామన్నారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తాం. కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతాం. కస్టడీలో ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. సామూహిక ఆత్మహత్య ఘటనకు ముందు బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు అండగా ఉంటారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఎస్పీ కోరారు. సాధిక్‌ఖాన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం కాకినాడ సబ్‌జైలుకు సాధిక్‌ఖాన్‌ను తరలించారు. నిందితుడిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ సర్పవరం పోలీసులు కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

## డేటా ఆధారిత పాలన మరింత బలోపేతం

### ఆర్‌టిజీఎస్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

డేటా ఆధారిత పాలనను మరింత బలోపేతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన రియల్ టైమ్ గవర్నెన్స్ పై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. అలాగే సచివాలయంలో మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. డేటా, ఏఐ తదితర అంశాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. 'మన మిత్ర' సేవలపై చర్చించారు. ప్లాట్‌ఫామ్ పని తీరును కూడా సీఎం చంద్రబాబు సమీక్షించారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. ఆస్పత్రుల డేటా విశ్లేషణపై ఆ శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్లు, రీ–సర్వే అంశాలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.రేషన్ పంపిణీ డేటా విశ్లేషణపై అధికారులతో చర్చించారు. రెవెన్యూ, విద్య, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారుల హాజరయ్యారు.

## పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం

**పులివెందుల, ఆగస్టు 24 (జై భీమ్ న్యూస్):**

జల్ జీవన్ మిషన్–అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళ్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు కళ్యాణ్ పత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణంఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ చూపలేదు. చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కూడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కూటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది. అప్పటి నుంచి కళ్యాణ్ ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కూడా దాదాపు తుది దశకు చేరింది. కూటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.


## కడప ఏరియాలో క్రిటకల్ మినరల్స్

**అమరావతి,ఆగస్ట్24(జై భీమ్ న్యూస్):**

కడప ఏరియాలో లక్షల కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సిఎస్ఐఆర్, ఎన్‌జిఆర్‌తో ఏపీ ప్రభుత్వం చారిత్రాత్మక ఒప్పందం చేసుకుందన్నారు. క్రిటికల్ మినరల్స్ వెలికితీత ఒప్పందం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. ముఖ్యంగా భవిష్యత్తు పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, సెమీకండక్టర్లు, రక్షణ రంగాలకు అత్యంత అవసరమైన లిథియం, గాలియం వంటి క్రిటికల్ మినరల్స్‌పై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఈ సంస్థల కీలక ఒప్పందం కుదిరింది. ఆగస్టు 12వ తేదీన అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ, ఎన్జీఆర్ఐ ప్రతినిధులు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, భూగర్భ నిర్మాణాలపై ఆధునిక జియోఫిజికల్ సాంకేతికత వినియోగం ఈ ఒప్పందంలో ప్రధానంగా ఉన్నాయి.

## వారణాసిపై మరో సంచలన వార్త

**వివిధ భాషల కోసం 1600 మంది డబ్బింగ్ ఆర్టిస్ట్‌లు**



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు రూ.1,400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది.'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. ఆయా భాషలకు సంబంధించిన ఉచ్చారణ, స్థానిక యాస, సంస్కృతికి అనుగుణంగా డైలాగ్స్‌ను రికార్డ్ చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా వంటి ప్రధాన నటుల నటనలోని ఎమోషన్ ఏ భాషలో చూసినా ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా ఈ డబ్బింగ్ ప్రక్రియను డిజైన్ చేస్తున్నారట. 50కి పైగా భాషల్లో ఇంత భారీ సంఖ్యలో డబ్బింగ్ ఆర్టిస్టులతో పనిచేయడం భారతీయ సినిమా స్థాయిలో అరుదైన ప్రయత్నంగా మారనుంది. వారణాసి కథాంశం కూడా అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. భూమిని ఢీకొట్టేందుకు దూసుకొస్తున్న ఓ భారీ ఉల్క వల్ల ఏర్పడే ప్రమాదం నుంచి వారణాసితో పాటు ప్రపంచాన్ని రక్షించే సాహసోపేతమైన కథతో ఈ సినిమా సాగుతుందని సమాచారం. మహేష్ బాబు ఇందులో 'రుద్ర' అనే పాత్రలో కనిపించనుండగా.. కథలో భాగంగా వివిధ కాలాల మధ్య ప్రయాణించే సాహసికుడిగా ఆయన పాత్ర ఉండబోతుందని టాక్. భారతీయ పురాణాలు, సనాతన సంస్కృతి అంశాలను ఆధునిక గ్లోబల్ అడ్వెంచర్ కథతో కలిపి రాజమౌళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. 'వారణాసి' షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్, ఒడిశా, ఆఫ్రికాలోని కెన్యా తదితర ప్రాంతాల్లో జరిగింది. అంతేకాదు.. అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకున్న తొలి భారతీయ చిత్రంగా ఈ సినిమా ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.

## రాకాలో ఐశ్వర్యలక్ష్మి

**నెగెటివ్ షేడ్ అంటూ ప్రచారం**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది. ఓ పవర్‌ఫుల్ డాన్ చుట్టూ తిరిగే ఈ కథలో అల్లు అర్జున్ అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారని టాక్. ముఖ్యంగా అట్లీ సినిమాల ప్రత్యేకతగా నిలిచే భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా ఉంటాయని తెలుస్తోంది.

## విడుదలకు ముందే టాక్సిస్ రికార్డులు

యశ్ కథానాయకుడిగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్: ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఆగస్టు 21న ప్రారంభమైన బుకింగ్స్‌కు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తుండటంతో.. విడుదలకు ముందే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. తాజా ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం తొలి రోజు కోసం భారత్‌లో డైరెక్ట్ అడ్వాన్స్ బుకింగ్స్‌లో రూ.21.5 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇప్పటి వరకు 13,591 షోలకు గాను దాదాపు 5.55 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఇక హోల్డ్‌లో ఉంచిన సీట్లతో కలిపి చూస్తే ఈ మొత్తం ఏకంగా రూ.30.14 కోట్లు దాటాయని ట్రేడ్ వర్గాల చెబుతున్నాయి. ముఖ్యంగా హోమ్ స్టేట్ కర్ణాటకలో ఈ సినిమా బుకింగ్స్ అగ్రస్థానంలో కొనసాగుతు న్నాయి. అక్కడ ఇప్పటికే రూ.10 కోట్లకు పైగా వసూళ్లు నమోదైనట్లు వార్తలు వస్తున్నాయి. పాన్-ఇండియా స్థాయిలోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'టాక్సిక్' మేనియా కనిపిస్తోంది. హిందీ బెల్ట్‌లో ఇప్పటికే రూ. 7.35 కోట్లకు పైగా బుకింగ్స్ జరగగా, నార్త్ అమెరికా (యూఎస్) ప్రీమియర్ బుకింగ్స్ ద్వారా 1.63 లక్షల డాలర్ల (రూ.1.56కోట్లు) వసూళ్లు వచ్చాయి. విదేశాల్లో ఈ సినిమా 260 లొకేషన్లలో, 709 ప్రాంతాల్లో రిలీజ్‌కానుంది.





## 80 కోట్ల మార్క్ దాటిన ఇరుముడి

రవితేజ నటించిన తాజా చిత్రం 'ఇరుముడి' బ్లాక్‌బస్టర్ హిట్‌గా రికార్డులు సృష్టిస్తోంది. తమిళంలో ఈ సినిమాకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా చెన్నైలో జరిగిన ఈవెంట్‌లో రవితేజ మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణం ఈ నగరంలోనే ప్రారంభమైందని తెలిపారు. 'ఇరుముడి'కి జీవీ ప్రకాశ్ హృదయంతో సమానం. ఎడిట్ రూమ్‌లో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (నేపథ్య సంగీతం) లేకుండా చూసినప్పుడే.. ఇది విజయం సాధిస్తుందని అర్థమైంది. ÷-లకైమాక్స్ చూసిన తర్వాత థియేటర్‌లలో మగవారితో పాటు చిన్న పిల్లలు కూడా భావోద్వేగానికి గురవుతున్నారు. ఆ దృశ్యాలు నిజంగా హృదయాన్ని హత్తుకుంటున్నాయి' అని రవితేజ అన్నారు. ప్రియా భవానీ శంకర్ గొప్ప నటి అని ప్రశంసించారు. ఈ సినిమా తెలుగులో విజయం సాధించినట్లే.. తమిళంలోనూ కచ్చితంగా సూపర్ హిట్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.'ఇరుముడి' చిత్రానికి ఓవర్సీస్‌లోనూ మంచి స్పందన వస్తోంది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. ఈ క్లబ్‌లో చేరిన రవితేజ మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఇక మూడు రోజుల్లోనే ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.80 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది.

## మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శుక్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది.క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్‌గా కనిపించారు. కేవలం 14 రోజుల్లో అసుర విజయ ఘోష సమస్త బ్రహ్మాండంలో ప్రతిధ్వనించేలా చేస్తానంటూ ఆయన చేసే ప్రతిజ్ఞ కథపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబోతున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మహాకాళి రౌద్ర రూపం. నల్లని వర్ణం, ముక్కుపుడక, ఉగ్ర స్వరూపంతో అమ్మవారిని అత్యంత శక్తిమంతంగా చూపించారు.




HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM